క్లుప్తంగా

విద్యతోనే సామాజిక ఎదుగుదల



కిషోర్ బాలికలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విద్యతోనే ఏదైనా సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా విద్యను అభ్యశించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పులకండం సత్యవేణి అన్నారు. పట్టణ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అర్బన్ సెక్టార్లో వెలమగూడెం సచివాలయంలో కిషోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవేణి మాట్లాడుతూ వ్యక్తిగత సామాజిక ఎదుగుదలకు విద్య ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్య మన ప్రతిభను విస్తృతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే ఎ.భారతీయ లక్ష్మి, కె.జస్సి, డీపీ మహాలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

నరసాపురం: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నరసాపురం యూనిట్ నూతన కమిటీని స్థానిక రాజగోపాల్ ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎం చిరంజీవి సతీష్, కార్యదర్శిగా కె.శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ.నానాజీ, ఉపాధ్యక్షుడిగా ఎం నాగమణి, పి.క్రాంతికుమార్, డీవీవీ సత్యనారాయణ, కె.ప్రభాజీ, ఎస్ ప్రశాంతిబాబు, పి.గణేష్ సత్యప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ వేణుగోపాల్, సహాయ కార్యదర్శులుగా పీఎస్ రవిప్రసాద్, ఆర్ఎస్ఆర్ ప్రసాద్, జి.కృష్ణవంశీ, పి.సత్య సునీల్, పి.దుర్గాలక్ష్మి ఎన్నికయ్యారు.

డ్రెయిన్ నిర్మించండి

నరసాపురం : స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో శిథిలమైన డ్రెయిన్‌ను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్రెయిన్‌ను పూర్తిగా పాడైపోయింది. ఈ డ్రెయిన్ రూరల్ పోలీస్ స్టేషన్ అవతల కొద్ది దూరంలో మెయిన్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ప్రస్తుతం డ్రెయిన్ శిథిలమవడంతో మురుగు నీటి పారుదలకు అనుకూలంగా లేదు. ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీపీని కలిసిన పీఎంపీల సంఘం నాయకులు



ఎంపీపీ ధనలక్ష్మీ రవికుమార్‌లకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

యలమంచిలి: ఎంపీపీగా ఎన్నికైన ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్‌ను శుక్రవారం పీఎంపీ అసోసియేషన్ నాయకులు కలిసి పూల మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మండలాభివృద్ధికి కృషి చేయడంతోపాటు తమ సంఘానికి తోడ్పాటు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొప్పినీడి వెంకటేశ్వరరావు అధ్యక్షుడు కె.ముక్తేశ్వరరావు, సలహాదారులు సీహెచ్‌వీపీ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ, కోశాధికారి జి.శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి ఎస్ దుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శి వి.చిట్టిబాబు, కార్యవర్గ సభ్యులు ఎస్ వెంకటేష్, మహమ్మద్ సలీం, అనంతపల్లి ఫణి కుమార్ తదితరులు ఉన్నారు.

కంపుకొడుతున్న తాగునీరు

నరసాపురం: స్థానిక 31వ వార్డు చినమామిడిపల్లి రైల్వే గేటు, నాగారమ్మ గుడి ప్రాంతాల్లో గత 20 రోజుల నుంచి కుళాయిల ద్వారా మురుగునీరు వస్తోంది. అసలే వేసవికాలం కావడం, మంచినీరు శుభ్రంగా రాకపోవడంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా దృష్టిపెట్టి పరిస్థితి చక్కదిద్దాలని వారు కోరుతున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా హెడ్ సంగీత కుమారి

పెనుమంట్ర: రైతులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా రీజనల్ హెడ్ సంగీత కుమారి సూచించారు. బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ అవగాహన, రుణ వితరణ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ శిబిరం ద్వారా 15 రోజుల్లో రైతులకు రూ.75 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్లు శ్రీధర్, లావణ్య పాల్గొన్నారు.

వంతెన కల నెరవేరేది ఎప్పుడో?

- పెనుగొండలో విద్యార్థులు, ప్రజల ఎదురుచూపులు
- నిర్మాణానికి కళాశాల వద్ద అనువైన ప్రాంతం



పెనుగొండ కళాశాల వద్ద ఫుట్‌పాత్ బ్రిడ్జి



పెనుగొండ - సత్యవరం వెళ్లడానికి దగ్గర దారి

పెనుగొండ: పెనుగొండ కళాశాల వద్ద పెద్ద వంతెన నిర్మాణానికి ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు, వేలాది మంది కళాశాల విద్యార్థులు ఎదురుచూపులు చూస్తున్నారు. 20 ఏళ్లకు పైగా కళాశాల వద్ద వాహనాల రాకపోకలు సాగించే విధంగా వంతెన నిర్మాణం చేపట్టాలంటూ ఎన్నో వినతి పత్రాలు అధికారులు, ప్రజాప్రతినిధులకు అందజేశారు. నిధులు లభ్యత లేకపోడం, ఇతరత్రా కారణాలతో వంతెన కల కల్లగానే మిగిలిపోయింది.

డెప్యూటీ సీఎంపైనే ఆశలు

ఇటీవల పెనుగొండను డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దత్తత తీసుకోవడంతో మరోసారి వంతెన కల తెరపైకి వచ్చింది. పవన్ ఆదేశాలతో నిర్వహించిన గ్రామ సభలో కళాశాల ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు ప్రతిపాదనలతో పాటు, ఇతర నాయకులు, ప్రజలు సైతం వంతెన నిర్మాణ అవసరతను పవన్ కల్యాణ ఓఎస్‌డీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి అనుగుణంగా ఇటీవల మంగళగిరిలో పంచాయతీ రాజ్ శాఖ సమావేశంలో అధికారులు ప్రతిపాదనలు చేయడం, ఇటీవల వంతెన నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని పరిశీలించడం జరిగింది. నిధుల లభ్యత ఆధారంగా వంతెన నిర్మాణానికి అనుమతులు రానున్నాయని ఉన్నతాధికారులు భరోసా ఇవ్వడంతో ఆయాప్రాంతాల ప్రజలు కోటి ఆశలు పెట్టుకొన్నారు.

అటకెక్కిన ప్రతిపాదనలు : 1980 దశకంలో కళాశాల విద్యార్థులు నడిచి వెళ్లే విధంగా పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల ఆధ్వర్యంలో ఫుట్ పాత్ బ్రిడ్జి నిర్మించారు. ఆ సమయంలో కళాశాలకు వచ్చే వాహనాల సంఖ్య తక్కువగా ఉండడం, సమీప ప్రాంతాల వారు ఆసక్తి చూపకపోవడంతో ఫుట్ పాత్ బ్రిడ్జితో సరిపుచ్చారు. అయితే, సమీప ప్రాంతాలైన దొంగగూడెం, శాంతి నగర్‌లలో నివాస ప్రాంతాలు పెరగడంతో పాటు, సత్యవరం వెళ్లడానికి దగ్గర మార్గమయ్యే అవకాశాలు ఉన్నాయంటూ వంతెన నిర్మాణం తెరపైకి తీసుకొచ్చారు. కళాశాలకు రావాలన్న, ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోగ్య సమస్యలతో నడవలేని పరిస్థితుల్లో వాహనాలపై వెళ్లాలన్నా అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. దీంతో 1995 సంవత్సరం నుంచి కార్లు, ఇతర భారీ వాహనాలు వెళ్లే విధంగా వంతెన నిర్మాణం చేపట్టాలంటూ ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. 2012లో వంతెన నిర్మాణానికి అంచనాలు, భూపరీక్షలు సైతం చేశారు. రాష్ట విభజన, నిధుల లభ్యత లేకపోవడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి.

గుడికి వెళ్లే దారి మూయవద్దు



మందాలమ్మ ఆలయానికి వెళ్లే దారిని మూయవద్దంటున్న వడలి గ్రామస్తులు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయానికి వెళ్లే నడక దారిని మూయవద్దంటూ వడలి గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తికి వినతి పత్రం అందజేశారు. గతంలో ఆలయ నడక దారిని కలిపి వసతి గృహ సముదాయం నిర్మించారని తెలిపారు. నిర్మాణం సమయంలో గుడికి వెళ్లడానికి అవసరమైన నడకదారి ఇవ్వాలని కోరగా దక్షిణం వైపున ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు దక్షిణంలో ఉన్న నడక దారిలో మరోసారి వసతి గృహ నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పూర్తిగా మూసివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు స్పందించి నడకదారి కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో కుంచే కృపారావు, చిటికెన చిన్న బ్రహ్మయ్య, బయ్యే వీర్రాజు, రాయవరపు వెంకట రమణారావు, దొండ శ్రీను, చిటికెన శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు అందుబాటులో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం తూర్పుపాలెంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఆ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపింది.

సబ్సిడీపై పశువుల దాణా

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు గ్రామంలో రైతుసేవా కేంద్రంలో శుక్రవారం సబ్సిడీపై పశువుల దాణా సరఫరాను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీపై పశు దాణా అందించి రైతుల్లో దీమా కలిగిస్తున్నామని చెప్పారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీ కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ పి.సుదీర్ బాబు, మండల పశు వైద్యాధికారి పి.పుండరీ బాబు, డాక్టర్ మౌర్య సత్యేంద్ర పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలి



వడ్డిలంకలో ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న జార్జి

యలమంచిలి: గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్డిలంక, మట్లపాలెం, నారినమెరక గ్రామాల్లో నిర్వహిస్తోన్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన వ్యవసాయ కార్మిక సంఘం బృందంతో కలిసి పరిశీలించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు కొలతలతో సంబంధం లేకుండా రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. ప్రతి కుటుంబానికీ 200 రోజులు పనులు కల్పించాలని, కార్మికులు పనిచేసే చోట టెంట్, మంచినీరు సౌకర్యం కల్పించాలన్న నిబంధనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాసవరపు సుబ్బారావు, కానేటి బాలరాజు, దేవ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన



అధ్వానంగా ఉన్న మంచిలి - అరవల్లి మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద లింక్ రోడ్డు

భీమవరం: అత్తిలి మండలం మంచిలి – ఆరవల్లి గ్రామాల మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఉన్న లింక్ తారురోడ్డు నిర్మాణానికి రైల్వే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కార్యాలయం శుక్రవారం తెలిపింది. రైతులు, ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఆ ప్రాంత ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. సమస్యను పరిష్కరించాలని మంచిలి ప్రజలు మంత్రి శ్రీనివాసవర్మను కోరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు అరుణ్ కుమార్ జైన్‌కు లేఖ రాశారని తెలిపింది. దీనికి స్పందించిన అరుణ్ కుమార్‌జైన్ పరిశీలించి ప్రణాళికలు తయారు చేసినట్టు మంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కళా కేంద్రంలో యోగా సాధన చేస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): యోగా మానసిక ఒత్తిడిని దూరం చేస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఏఎస్ఆర్ నగర్ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కళా కేంద్రంలో జిల్లా రెవెన్యూ అధికారి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు కొనసాగే యోగాంధ్ర-2025 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వెంకటేశ్వర్లు సూచించారు. వార్డు, గ్రామ స్థాయిలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డీఈఓ ఇ.నారాయణ, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి కె.మురళీకృష్ణ, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, పలు శాఖల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ డ్రైడేగా పాటించాలి



తణుకులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇకపై ప్రజలంతా ప్రతిరోజూ డ్రైడేగా పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు సూచించారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని జంగం చెరువు అంగన్‌వాడీ సెంటర్, గణేష్ చౌక్ సమీపంలోని మసీదు ఏరియాలో శుక్రవారం ఎన్జీఓ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ కె.పృథ్వీరాజ్ నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పరిసరాలను డ్రై చేయడం ద్వారా ప్రమాదకరమైన మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులకు వ్యాప్తి చేసే దోమల పుట్టుకకు చెక్ పెట్టవచ్చని అన్నారు. ఇళ్లలో నీరు చేరడానికి అవకాశం ఉన్న పనికిరాని సామగ్రిని సత్వరమే తొలగించుకోవాలని సూచించారు. డ్రెయిన్లలో చెత్త వేయవద్దని, దోమ పుట్టరాదన్న నినాదానికి అనుగుణంగా ఇప్పుడు చెప్పిన ఖర్చు రహిత పద్ధతులను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు కె.బేబీ కుమారి, బి.శిరీష, వార్డు ఉమన్ ప్రొటెక్షన్ సెక్రెటరీ ఎండీ హర్ష బేగం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం అరుణ కుమారి, అంగన్‌వాడీ టీచర్ వి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ హెల్పర్ ఎండీ థౌలా, ఆశా కార్యకర్త ఇ.లలిత పాల్గొన్నారు.

మద్యం దుకాణాల వద్ద నిబంధనలు పాటించాలి



తణుకులో మద్యం దుకాణం వద్ద ఎక్సైజ్ ఎస్సైలు.

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల వద్ద నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని ఆ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి ఆదేశించారు. నిత్యం రాత్రి నిర్దేశించిన సమయానికి మద్యం దుకాణాలు మూసివేసేలా, నిర్ణీత సమయానికి ముందుగా మద్యం దుకాణాలు తెరవకుండా నిరంతర పెట్రోలింగ్ నిర్వహణ చేస్తున్నట్లుగా స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి మద్యం దుకాణానికి ఒక కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌లను బాధ్యులను చేశామని, వినియోగదారులకు అందించే మద్యం నాణ్యతను కూడా నిరంతరం పరిశీలించటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా నెలకోసారి ప్రతి దుకాణం నుంచి మద్యం బాటిల్‌ను శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించి పరిశీలిస్తామని తెలిపారు. మద్యం దుకాణాల్లో నిబంధనలు ఖచ్చితంగా పాటించే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

4 నుంచి వరాల వెంకటేశ్వస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు



ఈడూరులో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయం

అత్తిలి: బుల్లి తిరుపతిగా పేరుగాంచిన ఈడూరు వరాల వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు జూన్ నాలుగు నుంచి ప్రారంభంకానున్నాయి. జూన్ 4న ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం వరాల వెంకటేశ్వర స్వామిని పెండ్లి కుమారునిగా, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. రాత్రి అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, వాస్తుహోమ పూజలు నిర్వహిస్తారు. 5న హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం పెన్మెత్స లక్ష్మీనరశింహరాజు, రామసత్యవతి దంపతులచే సమర్పించిన గజవాహనంపై గజవాహన సేవ, అల్లూరి సీతారామరాజు, మీనాక్షి దంపతులచే వైఖానస ఆగమం ప్రకారం వాడపల్లి శేఖరాచార్యులు, విఖన్‌బాబు పర్యవేక్షణలో స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. 6న తీర్థ మహోత్సవం, అన్నసమారాధన, రథోత్సవం, 7న సింహవాహన సేవ, 8న సుదర్శన హోమం, గరుడవాహన సేవ, 9న శేషవాహన సేవ, 10న చక్రస్నాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆకుల వెంకట నారాయణ, అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు తెలిపారు.

ఎండీయూ వాహనాల్లోనే రేషన్ ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: ప్రభుత్వం ప్రజలకు నిత్యావసర సరుకులను ఎండీయూ వాహనాల ద్వారానే సరఫరా చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరం 38వ వార్డు లంకపేటలో ఎండీయూ వ్యవస్థ రద్దును ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని, పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ రేషన్ వాహనాల ద్వారా అవినీతి జరుగుతుందనే నెపంతో ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించకుండా డిపోల వద్దే రేషన్ తెచ్చుకోవాలనడం అన్యాయమని వివరించారు. సీపీఎం పట్టణ నాయకుడు ఎం వైకుంఠరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని, సన్న బియ్యంతో పాటు కందిపప్పు, చింతపండు, నూనె, పంచదార వంటి నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, కుమారి సాయమ్మ, రమేష్, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు.. ఆపై చిత్తడిగా రహదారులు



బురదగా మారిన కొండ్రుప్రోలు కాలనీకి వెళ్లే రోడ్డు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు చిత్తడిగా మారాయి. ప్రధానంగా తాడేపల్లిగూడెం పట్టణం నుంచి శశి కళాశాల మీదుగా కొండ్రుప్రోలు కాలనీకి వెళ్లే రహదారి మరింత అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు రోడ్డుపై నిలిచి వాహనాల రాకపోకలతో బురదమయంగా మారింది. టిప్పర్ లారీలు నిత్యం పదుల సంఖ్యలో రావడంతో రహదారి మరింత అధ్వానంగా తయారవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో కొండ్రుప్రోలు కాలనీ ప్రజలు తాడేపల్లిగూడెం పట్టణం వైపు రావాలంటే ఎన్నో అవస్థలను ఎదుర్కొంటున్నారు. బురదమయంగా మారిన రహదారి అంచుల మీదుగానే రాకపోకలు సాగించవలసిన పరిస్థితి వచ్చింది. దీనికి తోడు వాహనాలు రహదారిపై వెళ్లే సమయంలో బురద దుస్తులపై చిందుతుందని పలువురు ప్రజలు వాపోతున్నారు. గణేష్ నగర్ నుంచి శశి కళాశాల వరకు నిర్మించిన రహదారిని కొండ్రుప్రోలు వరకు పొడిగించక పోవడంతో ఈ అవస్థలు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ప్రజలు పడుతున్న అవస్థలను గుర్తించి కొండ్రుప్రోలు కాలనీ వరకు రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించాలని కోరుతున్నారు.

వర్షాలు పడుతుంటే పూడికతీత పనులా?

- అస్తవ్యస్తంగా వేల్పూరు రోడ్డు
- దుర్గంధం.. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం
- బేరం పోయాయంటున్న వ్యాపారులు



తణుకు వేల్పూరు రోడ్డులో మురుగును దాటేందుకు చేస్తున్న ఫీట్లు

తణుకు అర్బన్: తణుకు వేల్పూరు రోడ్డులోని డ్రెయినేజీల్లో మునిసిపల్ అధికారులు చేపట్టిన పూడికతీత పనులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి కాలమే అయినప్పటికీ వర్షాలు పడుతున్న రోజుల్లో ప్రధాన డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేయడమేంటని నిలదీస్తున్నారు. గత వారం రోజులుగా ప్రతి రోజూ ఏదోక సమయంలో వర్షం వస్తున్న విషయం అందరికీ తెలిసిందే. తణుకు కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డులో వర్షం వస్తున్నా పూడికతీత పనులు నిర్వహిస్తున్నారంటూ దుకాణదారులు, నివాసితులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పూడికతీత పనులు చేయడం మంచిదేకానీ వర్షాలు పడుతున్న సమయంలో డ్రెయినేజీలోని మురుగును రోడ్డుపైనే వేయడంతో వర్షపునీటికి రోడ్డంతా కమ్మేయడం, తీసిన మురుగు తిరిగి డ్రెయినేజీల్లోకి వెళ్తుండడం వలన పని దండగ అని వాపోతున్నారు. అంతేకాకుండా ఈ రహదారులు గత మూడు రోజులుగా మురికి కూపాలుగా మారిపోయాయని ఇళ్లలోకి, దుకాణాల్లో వెళ్లలేకపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న రోడ్లలోకి వెళ్లలేని స్థితిలో మురుగు పేరుకుపోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు పడే సమయంలో పూడికతీత పనులు నిలిపివేయాలని ప్రజానీకం కోరుతున్నారు. మురుగు రోడ్లపై పోగుగా పెట్టడంతో వర్షం కారణంగా అంతా కలిసిపోయి దుకాణాల్లోకి వచ్చే మార్గం కూడా లేకపోయిందంటూ వ్యాపారులు వాపోతున్నారు.



తణుకు వేల్పూరు రోడ్డు నుంచి తాడి వారి వీధిలోకి వెళ్లే మార్గంలో ఇలా..



తణుకు కప్పలవెంకన్న సెంటర్ నుంచి రూట్స్ స్కూలు రోడ్డులో ఉన్న దుస్థితి



తణుకు తిప్పాని వారి వీధికి వెళ్లే మార్గంలో అడ్డంగా మురుగు తిప్ప

ఎన్‌సీసీ, నేవీల్లో తణుకు జెడ్పీ పాఠశాల విద్యార్థులు బెస్ట్



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం పద్మావతి

తణుకు అర్బన్: ఎన్‌సీసీ, నేవీ విభాగాల్లో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యున్నత స్థాయి ప్రదర్శన చూపిస్తున్నారని హెచ్‌ఎం కె.పద్మావతి తెలిపారు. ఈనెల 14 నుంచి 23 వరకు నరసాపురం స్వర్ణాంధ్రప్రదేశ్ కళాశాలలో నిర్వహించిన యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో మొదటి స్థానాల్లో నిలిచిన పాఠశాల విద్యార్థులను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఎన్‌సీసీ, నేవీ విభాగాల్లో తమ విద్యార్థులు నిత్యం ఎంతో క్రమశిక్షణతో అభ్యాసన చేస్తారని, ఫలితంగా బెస్ట్ గన్ ఫైరర్‌గా టి.నందేశ్, బెస్ట్ డ్రిల్ స్టూడెంట్‌గా ఎన్ కుష్లేశ్వర్ కుమార్, బెస్ట్ రన్నింగ్ రేసర్‌గా బీవీఎస్ఎస్ గణేష్‌లు ఎంపికయ్యారని హెచ్‌ఎం పద్మావతి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ అసోసియేషన్ నేవీ ఆఫీసర్ చీలిరాజును ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.